జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు


కొత్త గాజువాకలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు


బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి


బీహెచ్ఈఎల్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అసోసియేషన్ నాయకులు

పెదగంట్యాడ: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ సేవలు మరువలేమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దళితుల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. రక్షణ, రవాణా, వ్యవసాయ, కార్మిక శాఖా మంత్రిగా ఆయన అందించిన సేవలు ఎనలేనివన్నారు. రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మార్టుపూడి పరదేశి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గంట్యాడ గురుమూర్తి, పల్లా చినతల్లి, గంగూలూరి రోజారాణి, ధర్మాల శ్రీను, గొందేశి శ్రీనివాసరెడ్డి, గొందేశి వెంకటరమణారెడ్డి, కల్పన, నక్క వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

- 75వ వార్డు దుర్గవానిపాలెం ఎస్సీ కాంప్లెక్స్ ఆవరణలో బాబూ జగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, గంట్యాడ గోవిందరాజు, పెద్దాడ సోమునాయుడు, పులి వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు స్ఫూర్తిదాయకం

గాజువాక: మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎండీ గౌస్ అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా కొత్త గాజువాకలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. గౌస్ మాట్లాడుతూ దళిత వర్గాలకు జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ రెండు కళ్లవంటి వారన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పొందుపరిస్తే దాన్ని పార్లమెంట్‌లో అమలు చేసిన మహానేత జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. ఆయన సేవలు భవిష్యత్ తరాలకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో నాయకులు పెదిరెడ్ల ఈశ్వరరావు, పేరం రామకృష్ణారెడ్డి, కర్రి జగన్మోహన్, మోతి, ఖాజా, రాజా, షేక్‌ఆశ తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి

కూర్మన్నపాలెం: బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్ రామ్ అని కూర్మన్నపాలెం ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు అన్నారు. వుడా ఫేజ్–1 ఫంక్షన్ హాల్లో కూర్మన్నపాలెం ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఈడీ వసంతరావు పాల్గొని, జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించారు.


కూర్మన్నపాలెం: జగ్జీవన్‌రామ్‌కు నివాళులు అర్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం సభ్యులు

ఆయన మాట్లాడుతూ కమ్యూనికేషన్స్, రైల్వే, రవాణా, ఆహార, వ్యవసాయ, రక్షణ శాఖల్లో కేంద్రమంత్రిగా పనిచేసి మంచి కార్యదీక్షాపరునిగా పేరు పొందారన్నారు. దళితసేన రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు, గాలి ఆనంద్, బత్తిన సత్తిబాబు, బీఏ స్వామి, డాక్టర్ జొన్నలగడ్డ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్ఈఎల్‌లో ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొల్లి దేముడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భెల్ జీఎం (ఆపరేషన్స్) సి.గౌరీశంకర్, అధికారులు పి.కె.మిశ్రా, ఎ.మధుసూదన్, జి.చంద్రశేఖర్, జి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

- 69వ వార్డు హరిజన జగ్గయ్యపాలెంలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి గ్రామ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ కమిటీ పెద్దలు పెట్లి అప్పారావు, రవి, రామాంజనేయులు, శంకర్రావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌కు ఖాళీ లేదట..

- అసంపూర్తిగా వదిలేసిన కల్వర్టు నిర్మాణం
- మూడు నెలలుగా రాకపోకలకు అవస్థలు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు


సీడబ్ల్యూసీ రోడ్డుకు అనుసంధానమైన రోడ్డులో అసంపూర్తిగా మిగిలిపోయిన కల్వర్టు నిర్మాణం


సిమెంట్ పలకపై నుంచి స్కూటీతో కాలువ దాటుతున్న యువకుడు

గాజువాక: ఒక సీసీ కాలువ, సీసీ కల్వర్టు నిర్మాణంలో సంబంధిత కాంట్రాక్టరు నిర్లక్ష్యం, జీవీఎంసీ అధికారుల ఉదాసీన వైఖరి స్థానికులను అవస్థల పాల్జేస్తోంది. శంకుస్థాపన చేసిన రెండు నెలలకు పనిని ప్రారంభించిన ఆ కాంట్రాక్టరు, కాలువ నిర్మించి కల్వర్టు నిర్మాణాన్ని పట్టించుకోవడం మానేశారు. దీంతో స్థానికులు ఆ రోడ్డులో బిక్కుబిక్కుమంటూ వెళ్తున్నారు. మూడు నెలల నుంచి అవస్థలు పడుతున్నా అధికారులు మాత్రం స్పందించడం లేదు.

87వ వార్డులోని వడ్లపూడి కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్ (సీడబ్ల్యూసీ) ఎదురుగా ఉన్న కాలువల్లో మురుగు నిలిచిపోయి రోడ్లపైకి వస్తుండటంతో అక్కడ కల్వర్టులు నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. మెయిన్ రోడ్‌పై ఒక కల్వర్టు, దానికి అనుసంధానమైన మరో రోడ్డుపై సీసీ కాలువ, కల్వర్టు నిర్మించేందుకు రూ.16 లక్షల అంచనా వ్యయంతో వర్క్ ఆర్డర్‌ను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. గతేడాది నవంబర్‌లో శంకుస్థాపన చేయగా, మార్చిలో పని ప్రారంభించారు. మెయిన్ రోడ్‌పై కల్వర్టు నిర్మాణం పూర్తవగానే దానికి ఆనుకొని ఉన్న రోడ్డుపై కాలువ, కల్వర్టు నిర్మాణం కోసం రోడ్డును తవ్వేశారు. కాలువ నిర్మాణం పూర్తయినప్పటికీ కల్వర్టు నిర్మాణాన్ని మాత్రం ఇప్పటికీ చేపట్టలేదు. దాదాపు రెండు నెలలు పూర్తవుతున్నా అధికారులు సైతం అటువైపు కన్నెత్తి చూడలేదు. ఈ సమస్యను ఉన్నతాధికారులకు చెబుతున్నప్పటికీ కాంట్రాక్టరుకు ఖాళీ లేదని, వెంటనే పూర్తయ్యే విధంగా ఆదేశిస్తామంటూ చేతులు దులిపేసుకొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్థానికుల అవస్థలు

కల్వర్టు నిర్మాణం అసంపూర్తిగా ఆగిపోవడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఆ రోడ్‌లో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు కనీసం విద్యార్థులు వెళ్లేందుకై ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో కాలువపై సిమెంట్ పలకను ఏర్పాటు చేసుకున్నారు. దానిపై వెళ్తున్న విద్యార్థుల్లో ఎవరైనా జారిపడితే బాధ్యులెవరంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

వెంటనే పని ప్రారంభిస్తాం

కల్వర్టు నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. ఎండలు ఎక్కువగా ఉండటం వలన కాంట్రాక్టరు పనిని సకాలంలో పూర్తి చేయలేదు. వెంటనే పని ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించాం.

– ప్రసాద్‌బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, జీవీఎంసీ గాజువాక జోన్

ఏవీకే డిగ్రీ కళాశాల మూసివేతపై ఆందోళన


ఏయూ మెయిన్ గేట్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: గాజువాకకు చెందిన ఏవీకే డిగ్రీ కళాశాల అర్ధాంతరంగా మూసివేతపై ఆంధ్ర విశ్వవిద్యాలయం మెయిన్‌గేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఆ కళాశాల విద్యార్థులు ఆందోళన చేశారు. కళాశాలలో చదువుతున్న 400 మందికి పైగా విద్యార్థులు రోడ్డున పడే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల మూసివేస్తున్నట్లు యాజమాన్యం తమకు చెప్పిందని, వేరొక కళాశాలలో చేరాలని సూచిస్తున్నారని వాపోయారు. కళాశాలను కొనసాగించాలని, తరగతులను తక్షణం నిర్వహించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. అనంతరం ఏయూ సీడీసీ డీన్ ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కళాశాల యాజమాన్యంతో మాట్లాడి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూస్తామని డీన్ హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు అక్కడి నుంచి వెనుదిరిగారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్.జె.నాయుడు, సభ్యులు జి.పల్లవి, ఎం.శశికుమార్, సాయి తేజ, ఎం.తేజ, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అక్కిరెడ్డిపాలెం: 11 కేవీ గాజువాక ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా సంబంధిత ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్–2 ఈఈ బి.కె.నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా రాంనగర్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

వుడాకాలనీ ఫీడర్ పరిధిలో..

పెదగంట్యాడ: వుడా కాలనీ 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 7న విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు టీఎన్నార్ రోడ్ సిద్దేశ్వరం, వెంపళ్ల నగర్, సమతా నగర్, టెలిఫోన్ ఎక్స్చేంజ్ రోడ్, టీజీఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నా రు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్వచ్ఛసర్వేక్షణ్ మార్గదర్శకాలపై అవగాహన


మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్ కుమార్

గాజువాక: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అమలు చేయాల్సిన మార్గదర్శకాలపై జీవీఎంసీ గాజువాక సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ సచివాలయ శానిటరీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. జోనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకర చెత్తను ఇళ్ల నుంచి సకాలంలో సేకరించడంతో పాటు వ్యర్థాలను రోడ్లపై వేయకుండా అవగాహన కల్పించాలన్నారు. ఇళ్లలో ఉత్పన్నమయ్యే చెత్తతో ఇళ్ల వద్దే సేంద్రియ ఎరువులు తయారు చేయడంపై తెలియజేయాలని కోరారు. సామాజిక మరుగుదొడ్లను పరిశుభ్రంగా నిర్వహించే విధంగా చూడాలని, ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ బి.వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ అనుపు ఉత్సవం


మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే నాగిరెడ్డిలకు జ్ఞాపికలు అందజేస్తున్న కార్పొరేటర్ గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో కొలువైయున్న ముత్యాలమ్మ వారి అనుపు సందర్భంగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి వారికి జ్ఞాపికలు అందజేశారు.

భారీగా ఊరేగింపు

అమ్మవారి అనుపు ఉత్సవం విజయ రాఘవస్వామి ఆలయం నుంచి ఘనంగా ప్రారంభమైంది. భక్తులు ప్రభలు కట్టి, మేళతాళాలు, తప్పెట గుళ్ల, పులివేషాలతో భారీ ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తరలి వెళ్లారు. కుంచాలమ్మ, దుర్గాలమ్మ వారికి పసుపు కుంకుమలు సమర్పించిన అనంతరం ముత్యాలమ్మ వారి ఆలయంలో అనుపు నిర్వహించారు.

'ఉక్కు'లో ఎంపీ జీవీఎల్ పుట్టినరోజు వేడుకల అడ్డగింత


ఉక్కునగరం: ఎంపీ జీవీఎల్ పుట్టినరోజు వేడుకలను ఉక్కు ఉద్యోగులు అడ్డుకున్నారు. గాజువాక, ఉక్కునగరం బీజేపీ నాయకులు ఎంపీ పుట్టిన రోజు వేడుకలను స్థానిక ఉక్కుక్లబ్‌లో నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై బీజేపీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఉక్కు ఉద్యోగులు వేడుకలను నిరసించారు. ఉక్కు ఉద్యోగులతో పాటు ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అక్కడికి చేరుకుని బీజేపీ నాయకులు ప్లాంట్‌లోకి వస్తే సహించబోమని హెచ్చరించారు. వేడుకలను రద్దు చేయాలని బైఠాయించారు. రంగంలోకి దిగిన పోలీసులు ఉద్యోగులకు నచ్చ చెప్పడానికి ప్రయత్నించారు. కొద్దిసేపటికి వేడుకలు నిర్వహించటం లేదని బీజేపీ నాయకులు ప్రకటించారు. దీంతో ఉద్యోగులు ఆందోళన విరమించి వెనుదిరిగారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి. ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, జె. అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు


లబ్ధిదారుకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అగనంపూడి: అర్హులందరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందించడానికి చిత్తశుద్ధితో పని చేస్తున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 85వ వార్డు ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను గాలికి వదిలేస్తే.. ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసి చూపించిన ఘనత సాధించారన్నారు. పథకానికి అర్హత ఉండి ఇప్పటి వరకు వివిధ కారణాలతో నిరాకరించినప్పటికీ జగనన్న సురక్ష కార్యక్రమంలో వాటిని పరిష్కరించి, లబ్ధి చేకూర్చడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో ఏళ్ల నుంచి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించగలిగామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్, నాయకులు ఏదూరి రాజేష్, బోర సోమునాయుడు, ఇల్లపు వాసు, పెదిరెడ్ల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా మార్టుల్లో పొదుపు సంఘాలకు ప్రాధాన్యం


శిక్షణ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఏపీడీ రాము

గాజువాక: వ్యాపారం చేయాలనుకునే పొదుపు సంఘాల మహిళలకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలా మద్దతు లభిస్తుందని జీవీఎంసీ గాజువాక జోనల్ యూసీడీ సహాయ ప్రాజెక్టు అధికారి ఎల్.రాము తెలిపారు. నవరత్నాల్లో మెప్మా పాత్ర అంశంపై ఆరు వార్డుల పొదుపు సంఘాల రిసోర్స్ పర్సన్లకు గాజువాక జోనల్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలు ఏవైనా ఉత్పత్తులు తయారు చేసే యూనిట్లను ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం నుంచి మార్కెటింగ్ మద్దతు లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వం మహిళా మార్ట్‌లను ప్రారంభించనుందని, వాటిలో మహిళా సంఘాలకు ప్రాధాన్యం కల్పిస్తారని పేర్కొన్నారు. సంస్థను ఏర్పాటు చేసుకోవడం మొదలు ఉత్పత్తులను విక్రయించే వరకు అన్ని రకాలుగా మద్దతు లభిస్తుందని తెలిపారు. ఈ అంశంపై రిసోర్సు పర్సన్లు పొదుపు సంఘాల సభ్యులకు వివరించాలన్నారు. అనంతరం, జిల్లా రిసోర్సు పర్సన్లు ధనుంజయరావు, కె.శ్రీనివాసరావు, నవమణి తదితరులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

875వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు

కూర్మన్నపాలెం: కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టాలనే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం కుట్రలను పోరాటాలతో ఎదుర్కొంటామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 875వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీరును మార్చుకుని స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్

అగనంపూడి: జంతువుల నుంచి సంక్రమించే వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని అగనంపూడి పశువైద్యశాల వైద్యురాలు డాక్టర్ పి.లావణ్య అన్నారు. ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా అగనంపూడి వెటర్నరీ ఆస్పత్రి వద్ద జంతువులకు గురువారం వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువుల నుంచి మనుషులకు అనేక వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం 55 పెంపుడు జంతువులకు వ్యాక్సిన్లు వేశారు. కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది ఇంద్రాణి, రమణ తాతారావు, నాయకులు పాల్గొన్నారు.

రుసుం లేకుండా 11 రకాల ధ్రువపత్రాలు

'జగనన్న సురక్ష' పై విస్తృతంగా అవగాహన సదస్సులు


88వ వార్డులో అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీఎస్–2 కన్వీనర్ ఇల్లపు ప్రసాద్


65వ వార్డులో సురక్షపై అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ నరసింహపాత్రుడు

అగనంపూడి: జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఎటువంటి రుసుం లేకుండా అందిస్తారని జేసీఎస్–2 కన్వీనర్ ఇల్లపు ప్రసాద్ అన్నారు. 88వ వార్డు ఇన్‌చార్జి గంధ్రెడ్డి కనకమహాలక్ష్మి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 14న వార్డులో జగనన్న సురక్ష క్యాంప్ నిర్వహించనున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించి 7వ తేదీ నుంచి ఆరు రోజుల పాటు కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు క్లస్టర్ల పరిధిలో ఇంటింటికి వెళ్లి టోకెన్లు అందజేస్తారన్నారు. క్యాంప్‌లో సర్టిఫికెట్లు అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎల్‌వో హస్తమంత్ తదితరులు పాల్గొన్నారు.

- కాపు జగ్గరాజుపేటలో నిర్వహించిన జగనన్న సురక్ష అవగాహన కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు పాల్గొని, మాట్లాడారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి గంధ్రెడ్డి కనక మహాలక్ష్మినాయుడు, నాయకులు నమ్మి ప్రసాద్, లక్ష్మి, ఎంఎల్‌వో రోహిత్, ఉరుకూటి అప్పారావు, ఐతి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.
- కూర్మన్నపాలెం: 88వ వార్డు యాదవ జగ్గరాజుపేట సచివాలయ పరిధిలోని వార్డు కన్వీనర్లు, గృహసారథులు, వార్డు వలంటీర్లుతో ఎంఎల్‌వో రోహిత్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సచివాలయ పరిధిలో అర్హులందరికీ వలంటీర్లు జగనన్న సురక్ష పథకం ముఖ్య ఉద్దేశాన్ని వివరించి, వారికి అవసరమయ్యే ధ్రువపత్రాలను తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జి వాడపల్లి రామచంద్రరాజు పాల్గొన్నారు.

65వ వార్డులో..

పెదగంట్యాడ: పేదల మేలు కోసమే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు అన్నారు. వార్డు పరిధిలోని 5 సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు వికాస్‌నగర్ ఇండోర్ స్టేడియంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21న వార్డు స్థాయిలో నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చేతుల మీదుగా ధ్రువ పత్రాలను అందజేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి కులుకూరి మంగరాజు, ఎంఎల్‌వో వెంకటేష్, లోకనాథం, మద్దాల అప్పారావు పాల్గొన్నారు.

యువకుడిని కబళించిన లారీ


ఘటనా స్థలంలో పూతి మహేష్ మృతదేహం, ప్రమాదానికి కారణమైన లారీ

అక్కిరెడ్డిపాలెం: బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన యువకుడిని లారీ రూపంలో మృత్యువు కబళించింది. గాజువాక కణితి రోడ్డు వై జంక్షన్ వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో యువకుడు సంఘటన స్థలంలోనే దుర్మరణం చెందాడు. గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలివీ.. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టంనకు చెందిన పూతి మహేష్(25) స్విగ్గీలో పని చేస్తున్నాడు. మహేష్ గురువారం ద్విచక్ర వాహనంపై గాజువాక కణితి రోడ్డు వై జంక్షన్ వద్దకు రాగానే.. వెనుకనే వస్తున్న లారీ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అతని తలపై నుంచి లారీ వెళ్లిపోవడంతో.. మహేష్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న ఏసీపీ త్రినాథ్, ఎస్ఐ సతీష్ సంఘటన స్థలానికి చేరుకుని.. ప్రమాదంపై ఆరా తీశారు. వివరాలు సేకరించి,ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. లారీని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. మహేష్ అవివాహితుడు. అతని తల్లిదండ్రులు వీరఘట్టంలోనే ఉంటున్నారని ఎస్ఐ తెలిపారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ ఎన్టీపీసీ ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్టేషన్ ముఖ ద్వారానికి ముందు భాగంలో ఉన్న ఎన్టీపీసీ ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉండడాన్ని కీమెన్ గుర్తించి స్టేషన్ మాస్టర్‌కు సమాచారం తెలియజేయడంతో, దువ్వాడ పోలీసులకు సమాచారం అందించారు. దువ్వాడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ట్రాక్‌కు ఒకవైపు మృతదేహం మొండెం, మరో వైపు తల పడి ఉన్నాయి. మృతుని వయసు సుమారు 38 సంవత్సరాలు ఉండవచ్చని, మృతదేహంపై పసుపురంగు టీ షర్ట్, ప్యాంట్ వెనుక జేబులో రూ.120 మాత్రం ఉన్నట్లు తెలిపారు. ఇతర వివరాలేవీ లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఘనంగా సంకట హర చతుర్థి పూజలు


వినాయకుడికి పూజలు చేస్తున్న అర్చకుడు

అక్కిరెడ్డిపాలెం: భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద ప్రసన్న గిరిపై ఆలయంలో వినాయకుడికి సంకట హర చతుర్థి పూజలు నిర్వహించారు. గురువారం జరిగిన పూజా కార్యక్రమాల్లో ఆలయ పాలక మండలి ప్రతినిధులు, పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు చరణ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు యారాడ గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో బంక రాజబాబు అనే వ్యక్తికి చెందిన కమ్మల ఇల్లు కాలిపోయింది. ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి తెలియజేశారు. ఎమ్మెల్యే వెంటనే తహసీల్దారుతో మాట్లాడి, తక్షణ సాయం కింద రూ.5వేలు మంజూరు చేయించి బాధితునికి గురువారం అందజేశారు. అలాగే బాధితుడు ఇల్లు నిర్మించుకునేందుకు ఏఏవై పథకం కింద నమోదు చేయించారు.

టెన్త్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు గంగవరం హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన కొవిరి రోజారాణి, కంబాల బుజ్జి, కంబాల మానసలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో జెర్రిపోతుల ముత్యాలు, యరబాల భూలోక, వర్మ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ

అగనంపూడి: బోధనలో నూతన పద్ధతులు, విధానాలను అవలంబించడం ద్వారా విద్యార్థుల మనసుల్లో ఉపాధ్యాయులు స్థానం దక్కించుకోగలరని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు అన్నారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు బైజూస్ యాప్, ఇంటరాక్ట్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ)పై దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టెక్నాలజీ అనుసంధానంతో బోధనను మరింత సులువుగా, మెరుగ్గా సాగించేందుకు వీలుందన్నారు. కార్యక్రమంలో గాజువాక, పెదగంట్యాడ, విశాఖ అర్బన్ మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

గాజువాక: గాజువాకలో పేద మహిళలకు బీజేపీ నాయకులు చీరలు, నిత్యావసర సరకులను గురువారం పంపిణీ చేశారు. ఆ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు జన్మదినం సందర్భంగా గాజువాకలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాటిని నర్సింహారావు చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నిర్మలా కిశోర్, గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

డిప్లొమా పారా మెడికల్ కోర్సులకు నోటిఫికేషన్

అక్కిరెడ్డిపాలెం: డిప్లొమా పారామెడికల్ కోర్సులకు ఏపీ స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంటర్ పాసైన ఏ గ్రూప్ విద్యార్థులైనా అర్హులేనని పేర్కొన్నారు. డిప్లమా అనస్థీషియా, ఎంఎల్‌టీ, రేడియాలజీ, డీఎంఎస్‌టీ, కార్డియాలజీ, క్యాథ్‌ల్యాబ్, డయాలసిస్, పెర్ఫ్యూజన్, రెస్పిరేటరీ థెరపీ, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ కోర్సుల్లో అడ్మిషన్లు ఉంటాయని తెలియజేశారు. కన్వీనర్ కోటా సీట్లకు ఈ నెల 24 వరకు, మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు ఆగస్టు 24 వరకు గడువుగా పేర్కొన్నారు. కన్వీనర్ సీటు కోటాకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుందని తెలియజేశారు. వివరాలకు షీలానగర్ కిమ్స్ ఐకాన్ హాస్పిటల్‌ని బొల్లినేని మెడ్‌స్కిల్స్ నందు లేదా 7207953919, 7995013421 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.